# గుహుడు

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

శ్రీరాములవారి వంశం రఘు వంశం. తండ్రి దశరథుడు. తల్లులు కౌసల్య, కైకేయి, సుమిత్ర. భార్య సీతమ్మ. గురువులు వశిష్ఠ, విశ్వామిత్రులు. తమ్ములు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు. బంటు ఆంజనేయులు. భక్తురాలు శబరి. శత్రువు రావణుడు. అశేష జనం ప్రజ. మిత్రుడు గుహుడు.

వీరిలో ఒక్కొక్కర్ఠు ఒక్కొక్క రకంగా అతనిని పిలుచుకునేవారు. రామా అనీ, నాథా అనీ, సీతా నాథా అనీ. ఈ పిలుపులుకి మరి కొన్ని మనం కలుపుకొన్నాం. "రామయ్య, రామయ్య తండ్రీ, రామచంద్ర ప్రభూ, రామ స్వామీ, పట్టాభిరామమూర్తీ" అంటూ మన జీవితాల్లో ఆ ఆ తరుణాల్లో వివశులమై కేకలు వేస్తాం. అపరిమితమైన భక్తి ప్రపత్తులతో ఆహ్వానిస్తాం. పిచ్చి ఆప్యాయంతో పిలుచుకుంటుంటాం. ఆయన ప్రతీ ఇంటా ప్రతీ వ్యక్తిలో ప్రత్యక్షమవుతుంటాడు. ఊయాలలో పరుండి లాలిపాటలు పాడించుకుంటాడు. మళ్ళా తానే తన క్షమా దృఢ హస్తంతో మన లేత చేతుల్ని పట్టుకుని నడిపిస్తాడు. లోకంలో మానవునకు ఎన్ని చుట్టరికాలూ, బంధాలూ ఉన్నయో అన్నీ శ్రీరాములతో మనకు ఉన్నాయి. "అతనికేం అతను దశరథుడి వంటి తండ్రి, అంత విధేయుడైన కుమారుడు మరెవ్వరికీ లేడు" అంటాం. అలాగే "అతను ఆంజనేయునివంటి బంటు, లక్ష్మణునివంటి తమ్ముడు, శబరివంటి భక్తుడు" అని అంటూంటే, వెనకాల శ్రీరాములు ఉంటూనే ఉన్నారు కాదూ. ఆయనతో బాంధవ్యం స్ఫురిస్తూనే ఉందికాదూ!

శ్రీరామచంద్రుని బంధువులలో గుహుడు ముఖ్యుడు. మరి ఈ గుహుడు ఎవరో, స్వామితో ఇతనికి ఎటువంటి చుట్టరికమో మీకు తెలుసునా?

అసలు రామాయణం కథ అంతా మీకు తెలుసునా అని సందేహిస్తూ అడుగుతున్నాను. ఇదివరకు ఇంటింటా పెద్దలు రామాయణం పారాయణం చేసేవారు, రచ్చ చావడులలో పురాణం చెప్పేవారు. ఉత్సవపు పందిళ్ళలో హరికథలుగా వినిపించేవారు. మధ్యాహ్నం భోజనాలయాక నడవల్లోనూ, తులసికోటల ప్రక్కనూ, రాత్రి ప్రక్కలమీద పడమటింట్లోనూ అమ్మమ్మా అమ్మా సీతా రాముల కథలు చెప్పేవారు. ఈ కొట్టడానికి కూడా ఊపిరాడనంత ఉత్సాహంతో వినేవారు.

మన ఆదికవి వాల్మీకి. మన ఆదికావ్యం రామాయణం. నాటినుంచి కవు లందరూ రఘు రాముని గాథ ఏదో కావ్యాలలో అల్లుకున్నారు. స్త్రీలు ఆ ప్రభువు పడ్డ కష్టసుఖాలతో తమ కష్టసుఖాలు కలిపి మనోహర గేయ కావ్యాలు కల్పించుకున్నారు. రామాయణం తోలు బొమ్మలాట ఉంది. వీటన్నిటిలో ఆదికవి వాల్మీకుల కావ్యంలో లేని సంఘటనలూ, గాథలూ రక్తి కోసం చొరబడ్డాయి. అన్నిటిలో కూడా ఒకసారి సూర్యమండలంలాగ, ఒకసారి చంద్ర



http://www.maganti.org/

బింబంలాగ, ఒకసారి అందరానంత శిఖరం మీద, ఒకసారి అనుగై అంకంమీద - అవతరిస్తూ ఒకే ఒక శ్రీరామచంద్రమూర్తి సాక్షాత్కరిస్తాడు.

అయోధ్య నేలే దశరథుని కుమారుడై పుట్టడం, తల్లి దండ్రులకీ, గురువులకీ, ప్రజలకీ ఆనందం కలిగేటట్టు పెరగడం, విశ్వామిత్రుడు రావడం, చిరుజునపాలు చిన్న వంకలు తిరిగే నాడే రాక్షసుల్ని సంహరించడం, సీతాదేవిని వివాహమాడడం, పరశురాములకు గర్వ భంగం చేయడం, కైకేయి కోరిక కారణంగా తండ్రిమాట నిలబెట్టడానికి అరణ్య వాసానికి బయలుదేరడం - అంతవరకూ కథ జరిగింది. భార్య సీతమ్మతో, తమ్ముడు లక్ష్మణునితో రథం ఎక్కుతాడు. కూడా సుమంతుడు వస్తాడు. గంగానది ఇవతల ఒడ్డున ఉన్న శృంగిబేర పురం దగ్గరకు రథం వస్తుంది. అక్కడ సుమంతు డాగిపోయి అయోధ్యకు రథంతో వెళ్ళిపోతాడు.

శృంగిబేరపురం ప్రభువు గుహుండు. ఇక్కడనుంచి నాకు తోచినట్లుగా నా కళ్ళకు ఎలాగ కడుతుందో అలాగ గుహుని కథ చెప్తా. ఆది కవి కావ్యంలో నేను చెప్పినదంతా లేకపోవచ్చు.

శ్రీరాములు భార్యతో, తమ్మునితో అరణ్యానికి బయలుదేరినట్లు గుహుండు వింటాడు. వారు శృంగిబేరపురం సమీపించే ముహూర్తం కూడా దగ్గరవుతుంది. గుహుండు అలవికానంత ఆత్రంతో ఊగిపోతుంటాడు. శ్రీరామచంద్ర ప్రభువులకు తాను ఆతిథ్య మీయాలాయెను. పాపం. తానెంతవాడు ఆ స్వామికి ఉచిత సత్కార్యాలు చేయడానికి. కాని గుహుండికి తెలుసును కూడా, రాములవారి మనస్సు. ఎంత సులభుడాయన. ఎంత ప్రేమార్ద్రం ఆయన హృదయం. అయినా గుహుని మనస్సులో తొందర క్షణక్షణమూ ఎక్కువయిపోతుంది. అయోధ్యనుంచి శృంగిబేరానికి వచ్చే పుంత ధూళి రేగకుండా గంగాజలంతో తడిపిస్తాడు. అనుచరుల్ని పిలుస్తాడు. రాళ్ళను ఏరించేస్తాడు. మళ్ళీ పిలుస్తాడు, ముళ్ళు ఏరించేస్తాడు. మళ్ళీ మళ్ళీ పిలుస్తాడు. ఒక్క రాయీ, ఒక్క ముల్లూ లేకుండా చూడమంటాడు. వెర్రి తొందర పడతాడు. వెర్రి తొందర పెడతాడు. ఎంతదూరాలనుంచి అయినా రామయ్య ప్రభువు అడుగు సవ్వడి పోల్చుకో గల నంటాడు. ఆ అడుగు సవ్వడులు సమీపించినకొద్దీ పుంత పుంత అంతా వివశయై ఊగిపోతుందంటాడు. గూడలలో అల్ల నేరేడు పళ్ళు, దొన్నెలలో కర్రి అలి పాలూ, తేనెలూ నింపిస్తాడు. రామయ్య ప్రభువు ఒక్కడే వస్తుంటే అంత తొందర లేదు. సీతమ్మ తల్లి వస్తున్నారు. లక్ష్మణ మూర్తి వస్తున్నారు. గుహుని మనస్సుకు అంత అలజడి అదివర కెన్నడు కలగలేదు. అనుచరులతో ఊరుదాటి పుంతలో కొంతవరకూ నడుస్తాడు.

ఇంతలో దూరాన సీతారామ లక్ష్మణులు రథం దిగుతారు. వదినగారికి ఆయాసం కలుగుతుందేమో అని లక్ష్మణుడు "అదుగోనమ్మా, అదే శృంగిబేరం. మన మిత్రుడు గుహుని గ్రామం. అదుగో, ఆ చెట్లతోపులలో నుంచే కనపడుతుందే, అదే" అంటాడు. "ఆకు పచ్చని ముసుగులోనుంచి కనపడే లజ్జావతి లాగకనపడుతుంది దవ్వులనుంచి ఆ గ్రామం" అంటాడు—శ్రీరాములు. "మా చెల్లెలు ఊర్మిళాదేవిలాగ" అని అంటారేమో సీతాదేవి చిరునవ్వుతో. లక్ష్మణ దేవర విననట్లు "అదు



http://www.maganti.org/

గడుగో గుహుండే అనుకుంటాను. పరివారంతో ఎదురుచూస్తున్నాడు" అంటాడు.

అంతలో గుహుండు వారిని చూస్తాడు. రివ్వున పరుగెత్తి వచ్చి, శ్రీరాముల పాదాల మీద వాలబోతాడు. రామచంద్రమూర్తి గుహుణ్ణి కౌగిటిలోనే గుచ్చుకుంటారు. సీతా లక్ష్మణుల కళ్లు చెమ్మగిల్లుతాయి. పాపం. అరణ్యవాసానికి క్రొత్తగా బయలుదేరినవారికి ఈ గుహుండు మరీ ఎంత ఆప్తుడుగా పాత చుట్టంగా కనబడతాడో.

"రామా దయచేశారా. సీతమ్మ తల్లీ, మీరూ వచ్చారమ్మా? దయచేశారయ్యా లక్ష్మణ స్వామీ.

వచ్చినారా రామలక్ష్మణులు మీరు
వచ్చినారా మీరు జానకీదేవి
వచ్చి నా పట్టణం ఏలుకోరాదయ్య."

రామయ్యా. ఇంక మీరు ఇక్కడనుంచి వెళ్ళవద్దు. పద్నాలుగువేల నా పరివారంతో ఈ పట్టణం ఏలుకోండయ్యా. నేను కొలుచుకుంటూ ఉంటాను. నామాట తోసెయ్యకండి అంటూ గుహుండు బ్రతిమాలుకుంటాడు.

"పట్టణమున పాదములుపెట్టి మోపముగా" అంటూ శ్రీరాములు "అయ్యా, గుహా. నీవు నా మిత్రుడవు. పెద్దవు. తండ్రిగారి మాట పాలించవద్దా. నాతల్లి కైకమ్మ ఆజ్ఞ తోసెయ్యనా?" అంటాడు. గుహుండు మారుమాట చెప్పలేదు. ఆరాత్రి అక్కడ వేంచేసి ఉండమంటాడు.

"అల్ల నేరేడుపళ్లు ఆవుల్లపాలూ
గూడల్లో పెట్టుకున్న" గుహుండు ఆరాత్రి.

శృంగిబేరంలో సీతారామ లక్ష్మణులకు ఆతిథ్యమిచ్చి ఈనాటికీ మన ఆదరానికీ, పూజకీ పాత్రుడయ్యాడు. మరునాడు ఉదయం గుహుణ్ణి విడనాడి బయలుదేరి పోవాలి. నిన్న సాయంకాలం అన్యోన్య సందర్శనం ఎంత ఆనందం కలిగించి ఉంటుందో. ఈ ఉదయం వియోగం అంత దుస్సహమై బాధించి ఉంటుంది—ఆ నలుగురి మనస్సులనూ.

ఆ ఉదయం సీతారామ లక్ష్మణుల్ని శృంగిబేరంనుంచి పంపివేయడం నా కిష్టంలేదు. సంధ్యాసమయం దాటిన తరువాత, మునిమాపు ముసరక ముందు, వారిని గుహుండు గంగా నది దాటించినట్లు నా కళ్ళకు కనబడుతుంది.

సీతారామ లక్ష్మణులతో గుహుండు గంగా తీరానికి వచ్చాడు. గాలి కూడా దిగులువల్ల ఊపిరి బిగబట్టాడు. గంగానది కంఠం బిగిసిపోయి ఉంటుంది. మామూలుగా ఒళ్లు విరుచుకుని ఒత్తిగిల్లడం కూడా ఆ సమయంలో లేదు.

వియోగ సమయంలో గుండెలు బాగా బరువైపోయినపుడు, ఎందుకో మనం వెర్రి నవ్వులాటలూ, చమత్కారపు మాటలూ అనబోతాం. ఆమాటలలో మరీ పోటుతనం ఉంది. గుహుండు అంటాడూ "రామయ్య తండ్రీ ఒఖసారి మీ పాదాల్ని కడిగితేనేకాని నా పడవలో అడుగు పెట్టనియ్యను. ఏమో స్వామీ, మొన్ననేకదా మీ పాదరజం తగిలి రాయి స్త్రీ అయిపోయింది. ఇప్పుడు నా పడవకు కూడా ఆ గతే పడితే నే నేమవను చెప్పండి" అంటాడు. పాపం అసలు మనస్సులో ఉన్న అభిప్రాయం వేరు. శ్రీరామస్వామి పాదాలు ముట్టుకోవాలి. వాటిని కడగాలి. ఆ కోరికనే తెలియపరిస్తే ఆ వినయమూర్తి అంగీకరింపకపోవచ్చు. గుహుండు శ్రీరాముల పాదాలను గంగాజలంతో కడుగుతాడు. ఆ మాట లంటుంటే, ఆ అడుగుల్ని కడుగుతుంటే, కపోలాలు తడిసిపోతుంటే కన



http://www.maganti.org/

పడకుండా ఉండడానికి అమ్మవారు తలవంచుకుంటారు. లక్ష్మణస్వామి తలత్రిప్పుకుంటాడు. గుహుడు శ్రీరాముల పాదాలను కడుగుతాడు. వడకే చేతులతో ఎంత గారాంగా స్పృశించాడో ఆ అడుగుల్ని. ముద్దుగా, మృదువుగా, లాలిస్తూ, నిమురుతూ, ఒక పట్టున తెమలకుండా. గుహుడు శ్రీరాముల పాదాలను కడుగుతాడు. అంతకుముందు జనక రాజర్షి సీతమ్మతల్లిని అల్లుడికి ఇచ్చేటప్పుడు ఆ పాదాలను కడిగాడు. ఆ తరవాత నేటివరకు కోట్ల హృదయాలు కరిగి పొంగిన కన్నీరు ఆ పాదాలను కడుగుతున్నాయి.

స్వామి కాలు తడియ నక్కరలేని రేవు దగ్గర పడవ నిలబెట్టి ఉంచుతాడు గుహుడు. ఆ పడవలో మెత్తగా ఆకులూ, పువ్వులూ ఆసనాలుగా ఏర్పరుస్తారు. ముందు తాను చుక్కాని దగ్గర. తన దగ్గర శ్రీరామచంద్రమూర్తి. వెనక సీతామహాదేవి. ఆ వెనకాల లక్ష్మణస్వామి. పడవ కదులుతుంది కదలలేక కదలలేక. ఆ సాయంకాలం ఆ పడవ గుహుని హృదయం అంత బరువుగా ఉందాయెను. సుడులూ, వడులూ లేని నీటి దారులలో నావ నడిపిస్తాడు గుహుడు. శ్రీరాముల్ని గంగ దాటిస్తుంటాడు: "అమ్మా సీతమ్మ తల్లీ! మీకు ఇబ్బందిగా లేదుగదా, లక్ష్మణస్వామీ మీకు సదుపాయంగా ఉందా అయ్యా" అంటూ మధ్య మధ్య ఏవో బేలమాటలు అంటూ గుహుడు పడవ నడిపిస్తాడు. వారెవ్వరూ మాటాడ లేదు. నావ అవతలి వొడ్డుకి తగులుతుంది. దూరాన చిత్రకూటోపాంతన ఉన్న అరణ్యాలలోని చీకట్లు ధైర్యంగా ఇవతలికి వచ్చి పడిపోతుంటాయి. సీతారామ లక్ష్మణులు నావ దిగుతారు. శ్రీరాములు. గుహుణ్ణి పడవనుంచి దిగనీయరు.

"తండ్రీ, పద్నాలుగేడులపై ఒక్క గడియ ఆలస్యమైతే నే బ్రతకను సుమా." అంటాడు గుహుడు. ఆమాటలు అతని గద్గద గళంలో తునియలుగానూ, ఊరుపులుగానూ, తరువాత ఏడుపులుగానూ విరిగిపోతాయి. రామయ్య తండ్రి ధీరోదాత్తులు కనుక, చిరునవ్వుతో, "అలాగే వస్తాను" అంటారు. ముగ్గురూ చిత్రకూటంవైపు కదులుతారు. దూరాన చిత్రకూటం సందెచీకట్లో పెద్ద ఏనుగులాగ, ఒరిగిపోయిన నల్ల మేఘంలాగ కనిపిస్తుంది.

గుహుడు పడవ మర్లించిపోలేదు. అటే చూస్తుంటాడు. సీతారామ లక్ష్మణులు నడిచి, నడిచి, చిత్రకూటపు సానువుల వద్దకు వెడతారు. చీకట్లలో చిల్లులు పడేటట్లు గుహుడు చూస్తాడు. ఆచీకట్లలో మెరుపుల్లాగ సీతమ్మా, లక్ష్మణమూర్తీ కనపడతారు. అక్కడే శ్రీరాములుకూడా ఉంటారని అలాగే చూస్తుంటాడు.

"మసకమసక సందె, ఉసురుసురనుగాలి,  
గంగజాలి మ్రోత, బెంగవలన  
డిల్లవడిన పడవ, అల్లన నిలుచుండు  
నాగుహుండు పదియు నాలుగేండ్లు."

అని అనిపిస్తుంది నాకు.

"కోట్లను తరింపజేసినవాణ్ణి గుహుడు  
తరింపజేస్తాడు.  
లోకానికంతకూ శ్రీరాములు కర్ణధారి  
అయితే  
గుహుడు శ్రీరాములకు కర్ణధారి.  
ఓహోహో."

అని అంటుంది నాటినుంచీ ఈ భారత జగత్తు.



http://www.maganti.org/

ఇంక కథ. తరువాత శ్రీరాముల అరణ్యవాసం. సీతాపహరణం, శబరిగాథ, కిష్కింధ, సముద్రావతరణ, రావణ వధ, సీతారామలక్ష్మణులు తిరిగి రావడం. పదునాలుగేళ్ళు ముగియడం జరుగుతుంది. తిరిగివస్తూ, రాములవారు భరద్వాజాశ్రమం దగ్గరికి వస్తారు. నాటికి పద్నాలుగు సంవత్సరాలూ ముగిసిపోతాయి. భరద్వాజ మహర్షి రామచంద్రుణ్ణి నాటికి ఆశ్రమంలో ఉండి, తమ విందు స్వీకరించమని ఆజ్ఞాపిస్తారు. రామచంద్రులు ఆ ఆజ్ఞ స్వీకరిస్తారు. కాని "పదునాలుగేళ్ళపై ఒక్క గడియ ఆలస్యమయితే బ్రతుకను సుమా" అన్నాడు గుహుడు. అలాగే తల్లులూ, భరతుడూ అన్నారు. శ్రీరాముల మనస్సు తొందరపడుతుంది.

"రావయ్య హనుమయ్య పోవయ్య వేగ
అపకీర్తిరాకుండ అయోధ్యపురికి
కౌసల్యతో చెప్పు కడు వేగబోయి
కైకమ్మతో చెప్పు కడు వేగబోయి
సుమిత్రతోచెప్పు శుభము నీకౌను.
భరతునితో చెప్పు గుహునితో చెప్పు
మనరాక మన వీటి ప్రజలకందరికీ
చెప్పిరా హనుమయ్య చెప్పిరావయ్య
పదునాలుగేండ్లకు పైన ఒక గడియ
నిలిచినా ప్రాణాలు నిలువవో తండ్రి.

అన్నారు. పరుగెత్తవయ్యా హనుమయ్యా— అంటారు. ప్రాణాలు నిలబెట్టడానికే అవతరించిన ఆంజనేయమూర్తి. ఇదివరకు సీతాదేవి ప్రాణం, లక్ష్మణదేవర ప్రాణం నిలిపిన భిపక్చక్రవర్తి. రివ్వున ఆకాశంలోనికి ఎగురుతాడు. శృంగిబేరిపురం సమీపిస్తాడు. దూరాన మంటలూ పొగలూ కనబడతాయి .గుహుడు చందన కాష్ఠాలతో చితిపేర్చాడు. "రామా" అని పిలుస్తూ చితి ఎక్కబోతుంటాడు. "ఆగవయ్యా గుహా. రామచంద్ర ప్రభువుల విజయం చేస్తున్నారు." అని హనుమయ్య కేక వేస్తాడు. గుహుడు పరవశుడై మూర్ఛపోయి నేలమీది కొరుగుతాడు. తరువాత భరద్వాజాశ్రమంనుంచి శ్రీరాములూ వస్తారు. గుహునితో కలిసి నందిగ్రామం వెడతారు. అక్కడ జటావల్కలాలు విసర్జిస్తారు. అయోధ్యకు విజయం చేస్తారు. పట్టాభిషేకం జరుగుతుంది. ఆసమయంలో అందరూ సభలో ఉంటారు. ఒక్క దశరథుడు తప్ప. ఒకరు చామరం, ఒకరు ఛత్రం ఇలాగ పట్టుకుంటారు. ఒకరు పాదాలవద్ద ఒకరు ద్వారంవద్ద అలాగ నిలబడతారు. సుగ్రీవ జాంబవంతాదులు సభ్యులలో ఉంటారు. గుహుడొక్కడూ మిత్రస్థానంలో ఆసీనుడై ఉంటాడు.

ఛత్రగ్రాహిక దూర్మిళారమణ, చంచ
  చ్చామర
గ్రాహిక చ్ఛత్రుధ్వంసక కైకయీతనుభవా
దాసౌవిదత్వృత్రజిత్రత్రా, సభ్యద గాట
  భల్లుకమణీ.

పౌరాణికత్వావనీ, మిత్రద్దాశకులేశ, రాజ్యపదలక్ష్మీ ధూర్వహాత్పాదుకా. అని పట్టాభిరామమూర్తిని కవులు వర్ణించారు.

సుగ్రీవునికికూడా లేని పదవి గుహునికిచ్చారు. వాలికథ అయాక సుగ్రీవుడు విషయలోలుడై రామకార్యం మరచినప్పుడు "వాలిని చంపిన బాణం పదును పోలేదు'' అని లక్ష్మణుని ద్వారా సుగ్రీవునికి రాములు వార్త పంపుతారు. గుహునికొరకే మిత్రపదవి కటాక్షించారు ప్రభువు. ఇది కావ్యాలనుంచీ, గేయాలనుంచీ నేను కట్టుకున్న గుహుని కథ. (ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)

—: ● :—

Source: Press Academy Website, Kinnera Patrika April 1950

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan